ప్రభాతవార్త
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 19 సెప్టెంబర్ 2025

## రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడ పోటీలకు విద్యార్థులు

రాజంపేట, సెప్టెంబర్18 ప్రభాతవార్త

రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడ పోటీలకు రాయింపేట మండలం పెద్ద కారంపల్లి హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పెద్దకారం పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. ఇందిర తెలిపారు. అన్నమయ్య జిల్లా నుండి క్రీడా పోటీల్లో అండర్ 14 విభాగంలో 8 వ తరగతి విద్యార్థిని వరదరాజు వర్షిత, అండర్ 17 విభాగంలో 10 వ తరగతి విద్యార్థి కడుమూరి మిధున్ వర్మ రగ్బీ క్రీడ లో రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ కె. పార్థసారథి, ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు అభినందించారు.



## కరాటే పోటీల్లో మదనపల్లె
# విద్యార్థినికి బంగారు పతకం

మదనపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మదనపల్లె విద్యార్థిని బంగారు పతకం సాధించింది. ఇటీవల ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జికెఎంఎ నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ్మిశెట్టి రాజేంద్ర బిడ్డా కుమార్తె టి.కీర్తన బంగారు పతకాన్ని సొంతం చేసుకొంది. ఈ పోటీల్లో 26మంది పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సాధించిన కీర్తనను పాఠశాల యాజమాన్యం కరాటే మాస్టర్ సదాశివ, విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు.



# సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి

రాయచోటి, సెప్టెంబర్ 18: ప్రభాతవార్త

రాయచోటి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి వివిధ శాఖల వారు ఆయా శాఖలకు సంబంధించిన ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో ఎమ్మార్వోలు ఎంపీడీవోలు వివిధ శాఖల మండల స్థాయి సిబ్బంది తదితరులతో రెవెన్యూ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, వ్యవసాయం, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్, పర్యాటకం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాయచోటి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ప్రారంభించిన రాయచోటి ఆర్డీవో శ్రీనివాస అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం, దీపం, తల్లికి వందనం, వంటి పథకాలపై వివిధ అంశాలను జిల్లా కలెక్టర్కు వివరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఈ కేవైసీ పెండింగ్ అం శాలను త్వరగా పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. స్త్రీ శక్తి పథకంలో బస్సులలో ఆకుపన్సి రేషియో తదితర అంశాలపై ఆర్టీసీ శాఖ అధికారిని వివరాలను అడిగి తెలుసుకు న్నారు. హౌసింగ్ శాఖపై సమీక్షిస్తూ ఇంకా కొన్ని నీళ్ల పూర్తిగా కాకపోవడానికి కారణాలను డిఇ మరియు ఏఈల ను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ స్మార్ట్ కార్డుల పంపిణీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉద్యానవన శాఖ గురించి సమీక్షిస్తూ టమాట ఎక్కువగా పండించడానికి కారణాలు మరియు ఇతర సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ నీటి సరఫరా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ లపై సమీక్షిస్తూ ప్రస్తుతం చేపడుతున్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పల్లె పండుగ పనులపై వివిధ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మరియు ఐసిడిఎస్ శాఖలవారు సమన్వయంతో పని చేయాలన్నారు. రహదారులు మరియు భవనాలు శాఖలో పెండింగ్ పనులపై వివిధ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీరు మరియు తాగునీటి పై సమీక్ష నియోజకవర్గంలోని చిన్న మధ్య తరహా





ప్రాజెక్టులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖపై సమీక్షిస్తూ ప్రధానమంత్రి కుసుం మరియు ప్రధానమంత్రి సూర్య ఘర్ కొత్తకాలపై వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ పై దృష్టి సారించాలని అని మండలాల ఎంపీడీవోలను ఆదేశించారు. అనంతరం రి సర్వే, పర్యాటకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, రాయచోటి నియోజకవర్గం మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోల, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు యూరియా అందజేస్తాం : కలెక్టర్



దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, వ్యవసాయ శాఖ జేడిఏ చంద్ర నాయక్ లు యూరియా పంపిణీని తనిఖీ చేసి అలాగే అక్కడ వరి నాట్లను, ఉల్లీ పంటను పరిశీలించారు. రైతులకు యూరియా పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చింతకుంట గ్రామ సచివాలయంలో యూరియా పై అవగాహన సదస్సును కూడా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని రైతులకు సకాలంలో అందజేస్తామని, రైతులు యూరియా వాడకం పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎకరాకు 36 కిలోల నుండి 90 కిలోల లోపు పంట కాలం పూర్తి అయ్యే సమయంలో వేసుకోవాలని సూచించారు. అధిక యూరియా వాడడం వలన దిగుబడి తగ్గి, పీడపీడలు, తెగుళ్ల ఎక్కువ అయి పంట దిగుబడి ఖర్చు ఎక్కువ అవుతుందని తెలియజేశారు. అనంతరం చింతకుంట చెరువు కింద పంట పొలంలో వరి నాట్లు వేస్తున్న వారితో మాట్లాడారు. ఈ కూలీలు ఎక్కడినుంచి వచ్చారు అని ప్రశ్నించారు. మీరు బీహార్, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చి వేస్తున్నారని రైతులు తెలియజేశారు. ఇక్కడ ప్రాంత కూలీలకు పనులు కల్పించాలని, అది ప్రాంత కూలీలు ఎందుకు వరి నాట్లు వేయడం లేదని అడిగారు. అలాగే అక్కడే సాగు చేసిన ఉల్లి పంటను పరిశీలించి దిగుబడి ఎప్పటిలోగా వస్తుందని అడిగారు. రైతులతో మాట్లాడుతూ ఎక్కడా యూరియా కొరత లేదని రైతులు తమ పంటలు సాగు చేసే సమయంలో తగిన సమయంలోనే యూరియా వాడాలన్నారు. ఎక్కువగా ఏరియా వాడితే పంట నాణ్యత కూడా తగ్గుతుందని తెలిపారు. జిల్లాలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులకు కావలసిన యూరియా అందరికీ అందజేస్తామని అధిక మోతాదులో యూరియా వాడరాదని జేడిఏ చంద్రనాయక్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు, తహసిల్దార్ సంజీవరెడ్డి, ఏడీఏ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా పోతుగుంట

రాజంపేట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన శ్రీశైలం పుణ్యక్షేత్రం ఆలయ పాలకమండలి చైర్మన్గా రాజంపేటకు చెందిన పోతుగుంట రమేష్ నాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షులుగా రమేష్ నాయుడు పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలో నంద్యాల జిల్లాలో పార్టీకి సంబంధించి క్రియాశీలకంగా పనిచేసారు. అంతకు ముందు కూడా రాజంపేట నియోజకవర్గం లో పార్టీ ముఖ్య నేతగా క్రియాశీలకంగా వ్యవహరించారు. ఏబీవీపీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గా మూడేళ్ల పాటు పనిచేశారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. 2019 ఎన్నికల్లో రాజంపేట బిజెపి అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. అప్పటినుంచి రాజంపేట నియోజకవర్గం లో అన్ని మండలాల్లోనూ పర్యటిస్తూ పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేశారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం సిఫార్సు మేరకు ఎట్టకేలకు శ్రీశైలం ఆలయ పాలకమండలి చైర్మన్గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రాజంపేట బిజెపి శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో శ్రీశైలం ఉన్నా, అక్కడ నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేయడం, పార్టీ పరంగా క్రియాశీలకంగా పనిచేయడంతో బిజెపి రాష్ట్ర అధినాయకత్వం గుర్తించి ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శ్రీశైలం ఆలయ చైర్మన్ గా నియమించింది.

## సొంత ఊరిలో ఒక ఇల్లు కూడా కట్టలేకపోయినా జగన్

మైక్ ఇవ్వరని సాకుతో అసెంబ్లీకి ముఖం చాటేస్తున్న జగన్

జగన్ చేసిన తప్పిదాలను సరిదిద్దుతాం

నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 18, ప్రభాత వార్త:




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిటెక్ రవి

నాలుగు దశాబ్దాలుగా పట్టం కడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో సొంత ఊరిలో ఒక ఇల్లు కూడా కట్టలేక పోయారు అని వైకాపా పార్టీకి చెందిన వ్యక్తుల కంపెనీలతో ఒక సెంటు నిర్మాణంలో కూడా వ్యాపారం చేసారు అని చేసిన పని కంటే ఎక్కువ సొమ్మును బిల్లు చేసుకున్నారు అని, జగనన్న కాలనీలో 25 శాతం కూడా గృహ నిర్మాణాల పనులు పూర్తి కాలేదని మైక్ ఇవ్వరని సాకుతో అసెంబ్లీకి జగన్ ముఖం చాటేస్తున్నారని జగన్ చేసిన తప్పిదాలను సరిదిద్దుతాం అని నియోజక వర్గ ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి అన్నారు. గురువారం మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి స్థానిక నేతలతో కలిసి పులివెందుల లోని జగనన్న కాలనీ సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జగనన్న కాలనీలో అక్రమాలు జరిగాయని అందిన ఫిర్యాదు మేరకు విచారణలో ఇప్పటికే 410 మంది అనర్హులుగా గుర్తించడం జరిగిందని నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే గృహాలు అందేలాగా చూస్తామన్నారు.జగన్ కట్టిన జగనన్న కాలనీలో 25 కూడా పూర్తి చేయలేక పోయారు అన్నారు. తన పార్టీకి చెందిన వ్యక్తులకే నిర్మాణ పనులు ఇచ్చి సెంటు భూమి నిర్మాణంలో కూడా వ్యాపారం చేశారని ఆ పార్టీకి చెందిన ఓ వ్యక్తి తన కంపెనీ ద్వారా చేసిన పని కంటే ఎక్కువ బిల్లును చేసుకుని సొమ్ము చేసుకున్నారని ఈ సొమ్మునంతటిని రికవరీ చేయడం జరుగుతుందన్నారు. పులివెందుల ప్రజల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లకుండా ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు అనే సాకుతో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశాడనీ ఎమ్మెల్యే హోదాలో అయిన వెళ్ళి అసెంబ్లీలో సమస్యలు లేవనెత్తాలి కదా అని పులి వెందుల ప్రజల సమస్యలు పట్టనప్పుడు ఆ ఎమ్మెల్యే హోదా ఎందుకనీ వెంటనే రాజీనామా జగన్ రాజీ నామా చేయాలన్నారు. జగ నన్న కాలనీలో ఉన్న 7వేల గృహాలను అర్హులైన లబ్ధిదారులకు అంది ఎలా చేస్తామన్నారు.ప్రస్తుతం కూట మి ప్రభుత్వం ఉంది. వైసీపీ పూర్తి చేయని ఈ ఇళ్లను మేమే కట్టిస్తాం. బాధితు లందరికీ న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రజలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే మా ధ్యేయం అని తెలిపారు.ఈ కార్యక్రమం లో హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాషా, మాజీ పట్టణాధ్యక్షుడు మ ద్దూరు వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ , తొండూరు మండల ఇంచార్జ్ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ రాజు



సిద్ధవటం మండల పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకునికి సముచిత స్థానం ఉంటుందని రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్రాజు అన్నారు. గురువారం తన కార్యాలయంలో సిద్ధవటం పార్టీ మండల శ్రేణులతో సమావేశం అయ్యారు. మండలంలో పార్టీ పరిస్థితులు, అభివృద్ధి పనులు, ఇతర వ్యవహారాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్ధవటం లో ప్రతి గ్రామంలో టిడిపి బలోపేతానికి కృషి చెయ్యాలని కోరారు.అతి త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారుప్రతి పంచాయితీపై ప్రత్యేక దృష్టి సారిస్తాం అన్నారు.కష్టపడే వారికి అండగా ఉంటామన్నారు.సమైక్యంగా ఉంటే టీడీపీ కితిరుగులేదన్నారు.ప్రతి ఒక్కరి బయోడేటా అధిష్టానం వద్ద ఉందన్నారు.ఒక నెలలో ప్రతి కార్యకర్త సమస్యలు పరిష్కారం చూపుతాం అన్నారు.అధికారులు ,ప్రజలు నాయకులు తో కలిసి పని చెయ్యాలన్నారు. ప్రతి నాయకునికి పనితీరు ఆధారంగా ప్రాధాన్యత కల్పిస్తా మన్నారు.అధికారంలో ఉన్నాం, అందరిని కలుపుకు వెళ్ళాలని సూచించారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాయకులు పని చెయ్యాలనీ కోరారు.పార్టీ బలోపేతానికి కృషి చెయ్యండి,నేను అండగా ఉంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జులు ,యూనిట్ ఇన్చార్జులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితులు అరెస్టు

:చోరీ కేసును సవాల్‌గా తీసుకుని చేధించిన సీఐ

:రూ.8 లక్షలు విలువైన బంగారు, వెండి స్వాధీనం

: సీఐని అభినందించిన ఎస్పీ

బద్వేలు,సెప్టెంబరు 18, ప్రభాతవార్త :



ఈ నెల 10వ తేదిన బద్వేలు పట్టణం వెంకటయ్యనగర్‌లో శ్రీనివాసులు ఇంటిలో పట్టపగలు చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అర్బన్ సీఐ లింగప్ప ప్రత్యేక దృష్టిసారించారు. కేసును సవాల్‌గా తీసుకున్న ఆయన కేసును చేధించి బంగారు, వెండిని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పూర్తి వివరాలు వెల్లడిస్తూ వెంకటయ్యనగర్‌లో పట్టపగలు ఇంటి తాళం పగులకొట్టి చోరికి తెగబడి బంగారు, వెండి తీసుకెళ్లారు. ఘటనా స్థలంలో ఫింగర్ ప్రింట్స్ మరియు సీసీ పుటేజీల ఆధారంగా కడపకు చెందిన ఆటోడ్రైవర్ దిలీప్‌కుమార్, నాయబ్ రసూల్‌గా గుర్తించడం జరిగిందని సీఐ లింగప్పకు రాబడిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో గురువారం చెన్నంపల్లె ప్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మైదుకూరు నుంచి పై తెలిపిన ముద్దాయిలు ఆటోలో వస్తుండగా వారి ఆటోను తనిఖీ చేయడంతో నాయబ్ రసూల్, దిలీప్‌కుమార్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు.వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆటోతో సహా రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కేసును సీసీ కెమెరాలు మరియు క్లూస్ టీం ఆధారంగా, పింగర్ ప్రింట్స్‌తో దోషులను పట్టుకోవడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. అర్బన్ సీఐ లింగప్ప వచ్చిన పది రోజులలోనే కేసును సవాల్‌గా తీసుకుని చేధించడం పట్ల ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు. వీరితోపాటు ఎస్ఐలు ,క్రైం పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

## 22 నుంచి దసరా ఉత్సవాలు

దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరులో ని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం నందు ఈనెల 22వ తేదీ నుండి అక్టోబర్ మూడవ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు తెలిపారు. స్థానిక అమ్మవారి శాలనందు దసరా ఉత్సవాలకు సంబంధించిన పుస్తకాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 22వ తేదీ నుండి వరుసగా రాజేశ్వరి దేవి, అన్నపూర్ణాదేవి, పార్వతి దేవి, వరలక్ష్మీదేవి, లలితా దేవి, గాయత్రీ దేవి, మీనాక్షిదేవి సరస్వతి దేవి అలాగే బింద సేవ, మహిషాసుర మర్దిని అలంకారం, గజలక్ష్మి, విజయలక్ష్మి ఆ రోజున గ్రామోత్సవం, షమీ దర్శనం చివరి రోజున వసంతోత్సవం కార్యక్రమాలు ఉంటాయని అలాగే తెనాలి బ్రాండ్ వారిచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో ఆర్యవైశ్య సభ్యులు పట్టాభిరామయ్య, వివి స్వామి, రవీంద్రనాథ్, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

పీలేరు సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:

జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. పీలేరు పంచాయతీ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండల, నియోజకవర్గ స్థాయి అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్, పశు సంవర్ధక శాఖ, సివిల్ సప్లై, మైనర్ ఇరిగేషన్, రీ సర్వే, విద్యాశాఖ, స్త్రీశక్తి పథకం, అన్నదాత సుఖీభవ, పి 4, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, స్వమిత్వ, ఐవిఆర్ఎస్, ఏపీఎస్పీడీసీఎల్ తదితర శాఖల మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశంచేశారు. జిల్లా అధికారులు , డివిజన్, మండల స్థాయి పనులకు మాత్రమే పరిమితం కాకుండా కొత్త ఆలోచనలతో ముందు కెళ్లాలని, వచ్చే ఆరు నెలలు, ఒక ఏడాదిలో మీరు చేయాలనుకున్న కొత్త పనులకు ప్రతిపాదనలు, ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, తదుపరి సమావేశంలో వాటిపై సమీక్ష ఉంటుందని తెలియజేశారు. అంతే కాకుండా జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్టులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిపై చర్యలకు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి సారీ పీలేరు నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు ఆర్డిఓ, డి..ఆర్.డి.ఏ పిడి, పీలేరు తహశీల్దారు శివకుమార్, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తదితరులు పుష్పగుచ్చం అందించి, దుశ్శాలవలతో సత్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు, డిపిఓ రాధమ్మ, జి.ఎస్. డబ్ల్యూ.ఎస్ లక్ష్మీపతి, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, వాల్మీకిపురం, కలికిరి, కలకడ, గుర్రంకొండ, కెవి పల్లి తహశీల్దార్లు, ఎంపీడీవోలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులు, ఎంఈఓలు, మండల సర్వేయర్లు, ఇతర మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలుకుతున్న ఆర్డిఓ శ్రీనివాస్, తాసిల్దార్ శివకుమార్

## అపరిశుభ్రతపై జెడ్పి సీఈవో ఆగ్రహం

సిద్ధవటం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



సిద్ధవటం గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకునే బాధ్యత మన అందరిపై ఉందని కొంతమంది ప్రభుత్వ స్థలాలలో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకుంటూ అపరిశుభ్రత, మాంసాకృతులు, ప్లాస్టిక్ వంటి పదార్థాలు రహదారులపై వేయడంపై జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు మండల కేంద్రమైన సిద్ధవటం ప్రధాన బస్టాండ్ కూడలిలో ప్రభుత్వ స్థలాలలో కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేసుకొని అపరిశుభ్రత చేయడంపై దుకాణదారుల యజమానులకు నోటీసులు జారీ చేస్తామని ఆమె హెచ్చరించారు మండల కేంద్రమైన సిద్ధవటం లో గురువారం జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ బస్టాండ్ కూడలి నుండి రత్న సభాపతి నగర్ చెంచులక్ష్మి కాలనీ, మఠం వీధి పలు ప్రాంతాలలో ఆమె సందర్శించి అపరిశుభ్రతపై మండిపడ్డారు సిద్ధవటం లో పలు రహ దారుల్లో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని గ్రామంలో అన్ని రహదారుల్లో ఉన్న అపరిశుభ్రతను పది రోజు ల్లో పూర్తిగా తొలగించాలని మఠం వీధిలో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని రేపటి నుంచి పనులు ప్రారం భించి రోడ్లమీద ఉన్న నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు పారిశుద్ధ కార్మి కులు ప్రతిరోజు రెండు గంటలపాటు పనిచేస్తే గ్రామం శుభ్రంగా ఉంటుందంటూ ఆమె సూచించారు గ్రామ పంచాయతీ లో జనాభా దాదాపు 7వేలకు పైగా ఉన్నారని పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో భా గంగా అంకితభావంతో పనిచేయాలని మీకు ఇచ్చే వేతనాలు 6000 రూ, నుండి 8000 వేల రూ, పెం చేదానికి కృషి చేస్తామని గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టాలని సూచించారు. రహదారులు దెబ్బతిన్న చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని బస్టాండ్ కూడలిలో ఉన్న ప్రభుత్వ స్థలాలలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పా టు చేయాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఓ, మైతిలి ఎంపీడీవో ఫణి రాజకుమారి పరిపాలన అధికారి సోమశేఖర్ పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, సర్పంచ్ ప్రతినిధి బి ఓబులయ్య పం చాయతీ కార్యదర్శి దాసరి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 4 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు స్వాధీనం

రాజంపేట, సెప్టెంబర్18 ప్రభాతవార్త



కువైట్ నుంచి స్వదేశానికి వస్తూ అక్రమంగా బంగారు బిస్కెట్లను తరలిస్తున్న ఉమ్మడి కడప జిల్లా చెందిన ఇద్దరిని హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పక్కా సమాచారంతో విమానాశ్రయంలో అధికారులు వారిని తనిఖీ చేసినట్లు తెలిసింది. రహస్యంగా, అనుమానం లేకుండా బంగారు బిస్కెట్లు తలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఇందు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి నుంచి 3.5 కిలోల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ బంగారు బిస్కెట్ల విలువ 4 కోట్ల రూపాయలు పైబడి అని తెలిసింది. ఇటీవలే ఢిల్లీలో కూడా రాజంపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి సుమారు కోటి రూపాయలు పైబడి విలువైన బంగారు బిస్కెట్లు తలిస్తుండగా పక్క సమాచారంతో అక్కడ కస్టమ్స్ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది. ఈ కేసు కోర్టులో కూడా జరుగుతున్నట్లు తెలిసింది.

# ప్రశాంత వాతావరణంలో దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

: దసరా ఉత్సవాలకు అన్నిశాఖల అధికారులు సహకరించాలి : టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి





**బద్వేలు అర్బన్,సెప్టెంబరు 18, ప్రభాతవార్త :**

బద్వేలు పట్టణంలో ఈ నెల 22వ తేదిన ప్రారంభం కానున్న దసరా శరన్న వరాత్రి ఉత్సవాలకు అమ్మవారిశాల వద్ద అవసరమైన మౌలిక వసతులను మ రియు భద్రతా ఏర్పాట్లు ఉండేలా ఆయాశాఖల అధికారులందరూ సహక రించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి పలువురు అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.సి.సుబ్బా రావు, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, ట్రెజరర్ భూపాళం నాగరాజరావు, గౌర వాధ్యక్షులు కనమర్లపూటి ప్రసాద్‌తో పాటు పలువురు కమిటి సభ్యులు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి దసరా ఉత్సవాల పుస్తకాలు అందించారు. అలాగే దసరా ఉత్సవాలలో 11 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు అలాగే అమ్మవారిశాల ప్రాంగణంలో ప్రతి రోజూ చెత్తా,చెదారం బయటకు తరలించాలని అమ్మవారిశాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని రితేష్‌రెడ్డిని పలువురు కోరారు. గురువారం సాయంత్రం రితేష్‌రెడ్డి ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దారు ఉదయ భాస్కర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి, డిఎస్పీ రాజేంద్ర ప్రసాద్, సీఐ లింగప్ప, మరియు ఆయాశాఖల అధికారులతో కలిసి వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి వర్తక సంఘం కమిటి సభ్యులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందించారు. అనంతరం రితేష్‌రెడ్డి పలు శాఖల అధికారులతో మా ట్లాడుతూ బద్వేలు పట్టణంలో జరగబోయే దసరా ఉత్సవాలకు రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖల వారి సహకారంతో అవసరమైన ఏర్పాట్లను చేయా లని సూచించారు. అనంతరం కమిటి సభ్యులు రితేష్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదా లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంగళరెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, సింగంపల్లె శివయ్య స్వామి, రాధయ్య, వడ్లపూటి నాగభూష ణం, ఉపాధ్యక్షులు జూటూరు నాగరాజ, దర్శి సుబ్బరాజు, యాదాళ్ల క్రిష్ణమూ ర్తి, చాటకొండు సత్యనారాయణ ప్రసాద్, దిండుకుర్తి సుబ్బరాయుడు, గుబ్బా వెంకటేశ్వర్లు, జూటూరు రవి,తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య, శ్రీరాములు, బెస్తమళ్ల సునీల్‌కుమార్, చిన్ననరసింహ, కొప్పరపు శ్రీనుతో పాటు పలువురు కమిటి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకంతో ప్రభుత్వం పాఠశాలల మనుగడ ప్రశ్నార్ధకమే

**రాజంపేట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**

ప్రపంచ బ్యాంకుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందం ప్రకారం సాల్ట్(సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అవుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ .వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని ,ప్రభుత్వ విచారంగాన్ని పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు జరుగుతున్న యూటీఎఫ్ రణభేరి కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా రాజంపేటలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలు చేస్తూ నాణ్యమైన విద్యార్థిని తయారు చేయడం, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థిని తయారు చేయటం లక్ష్యంగా ప్రపంచ బ్యాంకు నుంచి 1860 కోట్ల రూపాయలు అప్పు తెచ్చుకుందని చెప్పారు. ఈ అప్పులో భాగంగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడమే ప్రధాన లక్ష్యంగా అప్పు ఉందని విమర్శించారు. దీన్ని రద్దు చేయాల్సిన కూటమి ప్రభుత్వం యధాతధంగా దీన్ని కొనసాగిస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలహీన పరుస్తుందని విమర్శించారు.సాల్ట్ పథకం వలనే ఈరోజు పాఠశాల పని దినాల్లోనే ట్రైనింగ్ ఇస్తున్నారని, రకరకాల బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులపై రుద్దుతున్నారని బలవంతం చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సాల్ట్ పథకానికి సమాచారాన్ని ,గణాంకాల్ని ఇవ్వటం కోసం అలాగే గిన్నిస్ బుక్ రికార్డుల కోసం ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురి చేయటం, పిల్లలకు అక్షరాలు చెప్పకుండా చేసేటువంటి ధోరణి వల్లే ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందనే అంశాన్ని ప్రభుత్వం గమనించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాలు అన్నిటి నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనకు అవకాశం ఇవ్వాలని



రణభేరిలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా నాయకులు

కోరారు. ప్రపంచ బ్యాంకుకు గణాంకాలు ఇవ్వటం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య వస్తుందా అని సూటిగా ప్రశ్నించారు. 2023 జూలై నుండి ఇవ్వాల్సిన 12వ పిఆర్సి చైర్మన్ ఇంతవరకు నియమించలేదని, నాలుగు డి ఎ లు బకాయిలు ఉన్నాయని, సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. వీటన్నిటిమీద ఒక్కసారి అంటే ఒక్కరోజు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం 12వ పిఆర్సి కమిటీ చైర్మన్ నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు సురేష్ కుమార్ ,రాష్ట్ర కార్యదర్శులు బి .లక్ష్మిరాజ, ఎస్.జయచంద్రా రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బి. హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రమణ మూర్తి, మండల అధ్యక్షుడు నాగేంద్ర,ప్రధాన కార్యదర్శి శివయ్య, రఫీ,మాధవ మూర్తి, నరసింహా రావు, రవిచంద్ర ప్రసాద్, యు.వెంకట సుబ్బయ్య, కె .శివ కుమార్ ఎన్.శ్రీనివాసులు, ఎం.వెంకట రమణ, డి.ఈశ్వర రాజు,సాంబ శివ రావు, చంద్రయ్య,ఉదయ్,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ లను ప్రభుత్వమే నిర్వహించాలి

**బద్వేలు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో నిర్మించి నిర్మాణంలో ఉన్న 17 వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కేటాయించకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.గురువారం స్థానిక పార్టీ కార్యాలయం లో విద్యార్థి యువజన కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం పిపిపిలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి చంద్రబాబు సర్కారు రంగం సిద్ధం చేసిందని, గత ప్రభుత్వం హయాంలో 8480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందేనని వీటిలో పది కళాశాలలను రెండు దశల్లో పి పిపి లో ప్రైవేటుకు అప్పజెప్పాలని బాబు సర్కారు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు .ఈ నేపథ్యంలో తొలిదశలో పులివెందుల మార్కాపురం మదనపల్లె ఆదోని కళాశాలలకు వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఏపీఎంఎస్ ఐడీసీ టెండర్లు పిలవడం విరమించుకోవాలన్నారు. అదేవిధంగా పులివెందుల వైద్య కళాశాలను 47.58 ఎకరాల్లో 586 కోట్లతో గత ప్రభుత్వం ఏర్పాటు చేయబడింది వైద్య కళాశాల బోధనాస్పత్రి నిర్మాణం కూడా గత ప్రభుత్వంలోనే పూర్తయింది సార్వత్రిక ఎన్నికలకు ముందే సీఎం హోదాలో కళాశాల బోధన ఆసుపత్రిని కూడా గత ప్రభుత్వం ప్రారంభించింది 50 ఎంబిబిఎస్ సీట్లతో గత విద్యా సంవత్సరం లోనే పులివెందుల కళాశాలల అక్కడమిక్ కార్యకలాపాలు ప్రారంభానికి ఎన్ ఎం సి అనుమతులు కూడా ఇచ్చింది అయితే కళాశాల మేం నిర్వహించలేమని కూటమి ప్రభుత్వం అనడం సిగ్గుచేటన్నారు .అయితే ప్రైవేటు వ్యక్తులకు ఊడిగం చేయడం కోసమే కుట్రపూరితంగా మేము నిర్వహించలేమని లేఖ రాయడం రద్దు చేయడానికి అనుమతులు చేయడం సరికాదని మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేయడం విరమించుకోకపోతే సిపిఐ ఎంఎల్ లేబరేషన్, అనుబంధ సంస్థలైనటువంటి విద్యార్థి యుజన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన తోపాటు ఉద్యమాల్ని కొనసాగించాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత విద్యార్థి అసోసియేషన్ జిల్లా నాయకులు బి అనిల్, ఏరియానాయకులు శంకర్. చరణ్. బన్నీ. యువజన సంగం నాయకులు శివరాం. రవి, కార్మిక సంఘం నాయకులు నారాయణ చంద్ర పాల్,. విజయరావు. తదితరులు పాల్గొన్నారు.




# వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

**పులివెందుల,సెప్టెంబరు 18, ప్రభాత వార్త:**

పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన 20 కుటుంబాలు గురువారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి ,టీడీపీ నాయకులు రాష్ట్ర హజ్ హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాష నల్లాగారి భాస్కర్ రెడ్డి, ఆధ్వర్యంలో శివకుమార్, సాయి కుమార్, సంతోష్ తో సహా 20 కుటుంబాలు తెలుగుదేశం తీర్థం పుచ్చు కున్నారు. నియోజక వర్గ ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ జగన్ పాలనలో పులివెందుల వెనకబడి పోయిందనీ ప్రజలకు అభివృద్ధి, ఉపాధి, గౌరవం ఏమీ రాలేదనీ కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం అభివృద్ధి కలిసి ముందుకు వెళ్తున్నాయనీ ప్రతి ఇంటికి వెలుగులు నింపేది, ప్రతి యువకుడికి భవిష్యత్తు కల్పించేది కూటమి ప్రభుత్వమే అన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లా డుతూ జగన్ ఇచ్చిన వాగ్దా నాలు అన్నీ మోసమే అని అభివృద్ధి అనే మాటే లేకుండా పులివెందుల ప్రజలు కష్టాల్లో పడ్డారనీ టీడీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధి చూసే మేము తెలుగుదేశం పార్టీలో చేరాం అని బీటెక్ రవి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలతో పులివెందులని ముందుకు తీసుకెళ్తుందన్నారు. పార్టీలో చేరుతున్న సందర్భంగా బిటెక్ రవి చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజక వర్గ ఇన్చార్జి మారెడ్డి రవీంద్ర నాథరెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు.ప్రజల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి వారి సమస్యలను బిటెక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ,కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



**దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ కొరకుస్వస్తి నార్ స్వశక్తి పరివార్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని అందులో భాగంగా గురువారం మండల పరిధిలోని అన్నపుసాత్ర పల్లె, ఎర్రబల్లె గ్రామాలలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రోహిణి తెలిపారు. మహిళలకు అన్ని రకాల సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో లభిస్తాయని అన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈనెల 17 నుండి 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యం బలపడితే కుటుంబమంతా సంతోషంగా ఉంటుందన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే తమ పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని అన్నారు. మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, విజయ కుమారి, శాంతకుమారి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు దుస్థితి చూసి కనికరించండి

**బ్రహ్మంగారిమఠం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర నగర్ కు వెళ్లా లంటే నానా అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే మా రోడ్డు దుస్థితిని చూసి మాపై కనికరించి మా గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని వీరబ్రహ్మేంద్ర నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.మండల కేంద్రానికి కూత వేటు దూరములో ఉన్న ఈ నగరవాసులు బ్రహ్మం సాగర్‌లో ముంపుకు గురైన మునకవాసులు.వీరు మనకకు గురి కావడంతో మండల కేంద్రంలోని వీరబ్ర హ్మేంద్ర నగర్ అనే కాలనీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.ఈ నగర్లో దాదాపు 70 కు టుంబాలు ఉన్నాయి. మండల కేంద్రం నుంచి వీరి గ్రామానికి వెళ్లా లంటే సరైన రోడ్డు లేక పెద్దలు పిల్లలు నాన అవస్థలకు గురవుతున్నారు. అక్కడ నుంచి ప్రతి నిత్యం మండల కేంద్రానికి రావలసి ఉంటుంది.వీరికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతినిత్యం తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పందించి వీరికి సరైన రోడ్డు సౌక ర్యం కల్పించాలని గ్రామవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



**గాలివీడు, సెప్టెంబర్ 18(ప్రభాతవార్త):**

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్ఆర్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో ఎస్ఐ రామకృష్ణతో కలిసి సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు, కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అవి అలవాటు చేసుకున్న వారి జీవితాలు నాశనం అయ్యాయన్నారు. మత్తుకి అలవాటు పడితే మెదడు పనిచేయడం మానేస్తుందని విద్యార్థులు వాటిపై అవగాహన చేసుకొని మరికొందరికి తెలియజేయడం ద్వారా నిర్మూలన సులువు అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలు బంద్.

**ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 18 (ప్రభాతవార్త):**




రాష్ట్ర వ్యాప్తంగా 6400 కోట్లు పెండింగ్లో ఉన్న డిగ్రీ కళాశాలల ఫీజు రియంబర్స్మెంట్ పై విడుదల వెంటనే విడుదల చేయాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ పద్మకి బంద్‌కు సంబంధించిన నోటీసులు ఇచ్చారు. అసోసియేషన్ కార్యదర్శి వెంకట శ్రీను మాట్లాడుతూ. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం జరిగిందని అయితే ఈ ప్రయత్నం లో ప్రభుత్వం నుండి ఎలాంటి ఫీజు విడుదల విషయంపై స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీలు కూడా ప్రభుత్వంకు విన్నవించాలని మనవి చేశాము కానీ ఇలాంటి ఫలితం లేదని వారు వాపోయారు. ఇప్పటికే 7 ఇన్స్టాల్మెంట్స్ పెండింగ్లో ఉందని, కళాశాల నిర్వహణ చాలా కష్టంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇలాంటి పరిస్థితుల్లో మేము విద్యార్థులను ఇబ్బంది పెట్టలేక మేము ఇబ్బంది పడలేక పూర్తిస్థాయిలో డిగ్రీ విద్యాసంస్థలను నిరవధిక బంద్ పిలుపు ఇవ్వాలని నిర్ణయం చేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రభుత్వము ఇప్పటికైనా ఆలోచించి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలలో ఫీజు రిబర్స్మెంట్ విడుదల నిర్ణయాన్ని తెలపవలెనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి సాహిత్య డిగ్రీ కాలేజ్, రవి శేఖర్ రెడ్డి శ్రీ దుగ్గనపల్లి కృష్ణారెడ్డి డిగ్రీ కళాశాల పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఉద్యోగులను వంచన చేయకండి




**వేంపల్లె :సెప్టెంబర్:18:(ప్రభాత వార్త)**

ఉద్యోగ ఉపాధ్యాయులను ఆర్థికపరమైన అంశాల హామీ అమలుపై వంచనకు గురి చేయవద్దని, ఎన్నికల హామీలు తక్షణమే అమలు చేయాలని ఎస్టీయూఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం కూడా ఉద్యోగ ఉపాధ్యాయులను మోసపుచ్చుతుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తుందని మండిపడ్డారు. 12వ పిఆర్సి అమలు ఇప్పటికే రెండేళ్లు ఆలస్యం అవుతుందని, మధ్యంతర భృతి ప్రకటనే చేయలేదన్నారు. నాలుగు డీఏ లు పెండింగ్ ఉన్నాయని, రూ.20 వేల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని, వీటిపై ఆశాజనకమైన పరిస్థితులు పాలకపక్షం వైపు నుంచి కనిపించడం లేదన్నారు. ఆర్థిక ప్రయోజనాల సాధనకై అక్టోబర్ నెలలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డిఎస్సీ 2025 ద్వారా అన్ని ఖాళీలు భర్తీ చేసి, బదలీ పొందిన వారికి రిలీవర్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, ప్రతాపరెడ్డి, లక్ష్మినరసింహ, గోవింద్, బాబు, భాస్కర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ధర్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్, బాషా, పవన్, అమీర్ తదితర నేతలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**మదనపల్లెక్రైమ్, సెప్టెంబర్ 18 ప్రభాతావార్త.**



పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 16 ద్విచక్ర వాహనాలు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 6 మందిని అదుపు చేసి, రూ.55 నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం డిఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మహేంద్ర మాట్లాడుతూ మదనపల్లె పట్టణం సమీపంలోని చౌడేపల్లె మండలం, బోయకొండ అటవీ ప్రాంతంలో జోరుగా పేకాట జరుగుతున్నట్లు డ్రోన్ ద్వారా సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఎస్సై అన్సర్, రహీం భాషలు సిబ్బంది తో సంఘటన స్థలానికి వెళ్లి పేకాట స్థావరం పై మెరుపు దాడి చేశారన్నారు. ఈ దాడిలో పలువురు పరారు కాగా, 6 మంది పట్టుబడ్డారని, అలాగే 16 ద్విచక్ర వాహనాలు, 5 సెల్ ఫోన్లు, రూ. 55 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో మదనపల్లె కు చెందిన శ్రీనివాసులు, శ్రీరాములు, పుంగనూరుకు చెందిన అక్కులప్ప, రెడ్డెప్పనాయక్, హరి, కలికిరి కి చెందిన వెంకటరమణ పట్టుబడటం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, పేకాట, కోడిపందాలు తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 2వ రోజు కొనసాగిన ఆత్మరక్షణ తరగతులు

**ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

రాష్ట్ర డీజీపీ సూచనలు, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావన ఆధ్వర్యంలో పట్టణంలోని వైవీ సుబ్బమ్మ పురపాలక బాలికోన్నత పాఠశాలలో 3 రోజుల పాటు నిర్వహించనున్న తరగతులు 2వ రోజు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. ప్రొద్దుటూరు శక్తి టీం ఇన్‌ఛార్జి ఎస్ఐ కేపీబీ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ నేర్చుకోవాల్సిన విద్య ఆత్మరక్షణ విద్య అని తెలిపారు. ఇది ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకునే ధైర్యాన్ని ఇస్తుందన్నారు. శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. విద్యార్థినిల భద్రత పట్ల అవగాహన కల్పించడం దాడుల వంటి సందర్భాల్లో తక్షణ ప్రతిస్పందన ఎలా ఉండాలో శిక్షణ అందించడమని ఎస్సై తెలిపారు. 5 మంది కరాటే మాస్టర్ల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ విజయ్ భాస్కర్, శక్తి టీం సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# సర్పంచి చొరవతో ఆలయానికి వెలుగులు

**కలికిరి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో గ్రామ దేవతగా వెలసిన నల్లగంగమ్మ ఆలయానికి స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ చొరవతో విద్యుత్తు వెలుగులు ఏర్పాటు చేయడం జరిగింది. ఆలయం సమీపంలో కొత్తగా విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. విద్యుత్తు స్తంభం లేక ఆలయం వద్ద చీకటిగా ఉండేది. స్థానిక సర్పంచ్ ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్ దృష్టికి తెచ్చారు. ఏఈ లైన్ మెన్ గోపీతో విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయడంతో విద్యుత్తు వెలుగులు రావడంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఎద్దులను కోల్పోయిన పేదరైతుకి చేయూత



**ఖాజీపేట, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**

రెక్కాడితే కానీ డొక్కాడని పేద రైతు కుటుంబం సుంకేసులకి చెందిన మద్దూరి ఆదిరెడ్డి కుటుంబం. సొంత ఇల్లు కూడా లేని ఆదిరెడ్డి అప్పుచేసి ఎద్దులను కొని వాటితో వ్యవసాయ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నారు. విధి వక్రించి సోమవారం నాడు వాగు దాటుతుండగా వాగు ప్రవాహం ఒక్కసారిగా పెరిగి నీటి ఉధృతి కి ఎడ్లబండితో సహా కొట్టుకుని పోయాడు. ఆదిరెడ్డి మాత్రం చేతికి అందిన చెట్టును పట్టుకుని ప్రాణాలు నిలుపుకున్నాడు కానీ జీవనాధారమైన ఎద్దుల ప్రాణాలు కాపాడలేకపోయాడు. జీవనానికి మూలమైన ఎద్దులను కోల్పోవడంతో కుంగిపోయిన ఆదిరెడ్డికి బాసటగా తనవంతు సాయంగా వైకాపా నేత, మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి 50000లను అందించి చేయూత నిచ్చారు. భవిష్యత్ లో సైతం సహాయసహకారాలను అందించేందుకు తామందరం ముందుంటామని, ఎలాంటి అధైర్యానికి లోను కావద్దని ఆదిరెడ్డి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు ఇరగంరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, రావులపల్లి సర్పంచ్ పైడేల శివరామిరెడ్డి, ఆంజనేయ కొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, త్రిపురవరం వైకాపా నేత సుబ్బారెడ్డి, ఖాజీపేట ఎంపిటిసి జంగిటి శివప్రసాద్, కొత్తపేట గోపాల్ రెడ్డి, సుంకేసుల మాజీ డీలర్ పెద్ది సుబ్బారెడ్డి, వార్డ్ మెంబర్ గంగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సుంకేసుల వైకాపా నేత దుగ్గిరెడ్డి బసన్నగారి వెంకట సుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి తిమ్మారెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి, కందినాగసుబ్బారెడ్డి, కండక్టర్ శ్రీనివాసులురెడ్డి, నందిపాడు వార్డ్ మెంబర్ ఆదినారాయణ రెడ్డి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ మూలే శ్రీనాథ రెడ్డిలు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కోర్ సంస్థ బృందం

**కేవీ పల్లి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏ.పి. ఆర్.జి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. లోకేశ్వరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన మరియు నియంత్రణ మండలి, అన్నమయ్య జిల్లా అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచనలనీ అనుసరించి ఇంటెన్సిఫైడ్ ఐఈసి క్యాంపెయిన్లో భాగంగా గురువారం పీలేరు ఏ.పి.ఆర్.జి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సహకారంతో విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ పై సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు నాకో (ఎన్ఏసిఓ) నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో 8 వారాల పాటు “మీకు తెలుసా” కార్యక్రమాన్ని చేపట్టారు. క్యాంపెయిన్లో భాగంగా కోర్ సంస్థ ఉద్యోగులు మాట్లాడుతూ హెచ్ఐవిపై తయారు చేసిన 8 రకాల అంశాలపై ఎనిమిది వారాల పాటు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్ఐవి రక్త పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రావడం జరుగుతోందని తెలియజేశారు. హెచ్ఐవి బాధితుల పట్ల ఉన్న చిన్న చూపు, వివక్షను హెచ్ఐవి, ఎయిడ్స్ ఆక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం ద్వారా వారి వివక్షను తగ్గించి, వారి జీవిత కాలాన్ని పొడిగించవచ్చని తెలిపారు. అందరూ రక్త పరీక్షలు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ కె. రవి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కోర్ ప్రతినిధులు యస్. హసీన, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రాజు కు కృతజ్ఞతలు



**రాజంపేట, సెప్టెంబర్18 ప్రభాతవార్త**

హత్యరాల దేవస్థానం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, సమర్థవంతంగా పనిచేసే ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రతిష్టను పెంపొందించేలా కృషి చేయాలని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు సూచించారు. గురువారం రాజంపేట టిడిపి కార్యాలయం లో అద్భుతంగా నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు చమర్తి జగన్మోహన్ రాజును సన్మానించారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియో గపరచుకుంటామని, ఆలయ అభివృద్ధి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూల నాగమణి, కమిటీ మెంబర్లు రమాదేవి, చిన్నయ్య, రమేష్, భారతి, వెంకటేశ్వర్లు, వేణుమాధవ్, నరసింహులు, ఎక్స్ ఎక్స్ ఎక్స్ ఆఫీషియో మెంబర్గా ఆలయ అర్చకులు పద్మనాభ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# సకల మానవ శ్రేయస్సు కోరే గ్రంథమే భగవద్గీత

**బ్రహ్మంగారిమఠం సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



మానవ శ్రేయస్సు కోరే గ్రంథమే భగవద్గీత అని చాపాడు వెంకట సుబ్బారెడ్డి అన్నారు.మండల పరిధిలోని నరసనపల్లి గ్రామంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కడప వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శోకరాహిత్యం, ఆనంద ప్రాప్తి ఇదియే గీతా లక్ష్యమన్నారు. యుద్ధరంగమున వికల మనస్కుడైన అర్జునుడు శ్రీకృష్ణుడు చేసిన గీతా బోధతో శోకరాహిత్యం నొంది ఆనంద ప్రాప్తి చేకూరడంతో కార్యోన్ముఖుడయ్యారన్నారు. ధర్మము అధర్మం గురించి స్థితప్రజ్ఞత గురించి నీ విద్యుత్ ధర్మాన్ని నువ్వే చెయ్ అని,నిన్ను నీవు ఉద్ధరించుకోవాలని గీత బోధించిందన్నారు. కార్యక్రమం ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి బాబు పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమానికి చిన్న గంగిరెడ్డి, ఈశ్వరయ్య,ఈశ్వర్ రెడ్డి, శారద, వెంకటలక్ష్మమ్మ, వీరమ్మ తదితర భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

తొండూరు సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :



మండలంలోని ఇనగలూరూ గ్రామంలో స్వస్థ నారి సశక్తి పరివార్‌లో బాగంగా డాక్టర్. ఆర్రిపుల్లా ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గంగయ్య, మండల ప్రాదేశిక సభ్యులు దశరథ రామిరెడ్డి ప్రారంభించారు. అన్ని రకాల రక్తపోటు, షుగర్,క్యాన్సర్, రక్త పరీక్షలు చేసి మందులు అందచేశారు. వర్షాకాలం ప్రారంభమైన సమయంలో జ్వరం, దగ్గు దోమల పట్ల చాలా జాగ్రత్త వహించాలని ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించి దోమ కాటును నివారించినట్లయితే జ్వరాలు తగ్గుముఖంపడతాయి అంతేకాకుండాప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని సూచించారు. ఈ శిబిరంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య, సూపర్వైజర్ శశికళ,గ్రామ కమ్యూనిటీ అధికారినిలు శిరీష, సోమేశ్వరీ, ఆరోగ్యకార్య కర్తలు మధుర, నాగేశ్వరమ్మ, కేశమ్మ, షాహనాజ్ ఆశా కార్యకర్తలు, అంగన్వాడికార్యకర్తలు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారన చర్యలు చేపట్టండి

గుర్రంకొండ, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త



వర్షాకాలంలో వ్యాప్తి చెందే గాలికుంటు వ్యాధులు ప్రబలుకుండా నివారన చర్యలు చేపట్టాలని గురువారం డిప్యూటి డైరెక్టర్ జి. శ్రీనివాసులు తెలియజేశారు. గుర్రంకొండ పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పశువులను, దూడలకు గాలికుంటు వ్యాధులు రాకుండా నివారన టీకాలను పంపిణీ చేయాలని మండల పశువైద్యాధికారి సునీల్‌నాయక్‌కు సూచించారు. వర్షాకాలంలో వ్యాప్తిచెందే వ్యాధులు,జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పదకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలను సరిచేసిన సిబ్బంది

ముద్దనూరు.సెప్టెంబర్18 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని రైల్వే గేట్ సమీపంలోని జెండా మాను వీధిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు అనే వార్తను గత నెల 17వ తేదీన వార్త దినపత్రికలో ప్రచురించగా విద్యుత్ అధికారులు స్పందించి గురువారం నాడు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను ఏఈ శ్రీనివాసరెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ శీను మరియు యోగానంద రెడ్డి ఆధ్వర్యంలో సరి చేయడంతో స్థానిక ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను అభినందించారు.

## పాఠశాలకు నీటి ట్యాంకు వితరణ

పెనగలూరు సెప్టెంబరు 19 ప్రభాతవార్త



మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొడిదల సాయికుమార్ విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు లక్ష రూపాయల వ్యయంతో నీళ్ల ట్యాంకు నిర్మించి తాగునీరు అందించడం అభినందనీయమని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. గురువారం పాఠశాలలో ఇన్చార్జి హెడ్మాస్టర్ అల్లం మహేశ్వర్ నాయుడు అధ్యక్షతన నీళ్ల ట్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కే సాయి కుమార్, కె వినీత్ రాయల్ జనసేన మండల ప్రధాన కార్యదర్శి గొబ్బూరు హరిబాబు, ఎంపీడీవో విజయరావు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయి సిబ్బంది చొరవ చూపాలి

లక్కిరెడ్డిపల్లి; సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



రైతుల పంట వివరాలు సమగ్రంగా నమోదు చేయించుకొనేలా క్షేత్ర స్థాయి సిబ్బంది చొరవ చూపాలనీ జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివ నారాయణ పేర్కొన్నారు. గురువారం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివ నారాయణ రైతు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా E-Crop Booking కార్యక్రమం అమలు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, రైతుల వివరాలు సకాలంలో నమోదు అయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. సహజ వ్యవసాయాన్ని అనుసరించడం ద్వారా పంటల ఉత్పాదకత పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. సహజ వ్యవసాయంలో ముఖ్యమైన ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని, దాని వినియోగాన్ని రైతులకు సూచించారు. జీవామృతం వలన నేలలో సూక్ష్మజీవులు పెరిగి, పంటలు ఆరోగ్యంగా ఎదిగి, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆయన చెప్పారు ఈ సందర్శనలో వ్యవసాయ అధికారిని రాజకుమారి,వ్యవసాయ విభాగ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:




రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చాక దళితులకు అన్యాయం జరుగుతుందని, దాడులు జరుగుతున్నాయని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం కడప వైకాపా కార్యాలయంలో విలేకరులతో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 20 తేదీ కడప పాత రిమ్స్ బీసీ భవన్లో జిల్లా ఎస్సీ కార్యవర్గ సమావేశం జరగనుందని వెల్లడించారు. జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌తో పాటుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారని వెల్లడించారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి దళిత సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు. కార్పొరేటర్ బండి ప్రసాద్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచిపాటి బాబు, ఎనమల రవి, అజయ్, శ్రీను పాల్గొన్నారు.

## ట్యూటర్‌గా పదోన్నతి కల్పించండి

కడప కార్పొరేషన్ 18 ప్రభాతవార్త:

కడప రీజినల్ డైరెక్టర్ డా. రామగిడ్డయ్యను జిల్లా ఏపీ యన్‌జిజివో అధ్యక్షలు బి.శ్రీనివాసులు, కార్యదర్శి నిత్యపూజయ్య గురువారం కడపలో కలిసి శారు. బిబిసి నర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ఫై ట్యూటర్స్ గా ప్రమోషన్ కల్పించాలని కోరారు. మూడు రోజుల్లో సీనియర్టీ జాబితా తయారు చేస్తామని, తగు న్యాయం చేస్తామని ఆర్ డి సానుకూలంగా స్పందించారు. జిల్లా అధ్యక్షలు బి శ్రీనివాసులు మాట్లాడుతూ మీ పరిధిలోని సూపెర్వైసోర్, పి ఎచ్ యన్, యం. పి ఎచ్ ఈ వో, ఎచ్ ఈ ల ప్రమోషన్స్ చాలా రోజుగా నుండి పెండింగ్ ఉన్నాయని వారికి వెంటనే పదోన్నతి ఇవ్వాలని కోరగా త్వరలో వారికి పాదోన్నతి కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మనాబారావు, జిల్లా విమెన్ వింగ్ కోశాధికారి పద్మావతి, ప్లారెన్స్ పాల్గొన్నారు.



## రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం

సుండుపల్లె, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:



మండలంలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా ఊట చెరువు నిండి మొరవలో నీరు అధికంగా రావడంతో మండల కేంద్రం నుండి గుండ్లపల్లె కు వెళ్లే వడ్లపల్లె సమీపంలో చిట్టేటి వంకపై నిర్మించిన తాత్కాలిక తూములు వేసిన మట్టి రోడ్డు పైన నీరు అధికంగా వచ్చి మట్టి రోడ్డు గుంతలమై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇలాగే బింగివాండ్లపల్లి మరియు వడ్లపల్లి దగ్గర వంక పై నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డు గుంతల మైమై రాకపోకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న మండల తహసిల్దార్ మెహబూబ్ చాంద్ మరియు పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి వాహనదారులను మరియు ప్రజలను అటువైపు వెళ్ళనీయకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జ్యోతిర్మయి వీఆర్వో వెంకట సుబ్బయ్య వీఆర్ఏలు పాల్గొన్నారు.

## గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, సెప్టెంబర్ 18(ప్రభాతవార్త):



పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం కుమ్మరపల్లెలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పశువులను పరీక్షించి 35 ఎదకు రాని పశువులను, 25 పశువులకు సాధారన పరీక్షలు, 62 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. అంతేగాక గొంతువాపు నివారణ టీకాలు వేయడం దూడలకు నట్టల నివారణ మందులు తాపడం జరిగిందన్నారు. అనంతరం పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, సహాయ సంచాలకులు శివారెడ్డి, స్థానిక పశువైద్యులు నాగరాజు, సిబ్బంది శశికళ, లక్ష్మీనారాయణ, హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిఎస్పి

నిమ్మనపల్లి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



మదనపల్లె డీఎస్పీ మహేంద్ర నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, విచారణలో ఉన్న కేసులు, ట్రయల్ కేసులు, స్టేషన్ ఆస్తులను పూర్తిగా పరిశీలించారు. స్టేషన్ శుభ్రత, సిబ్బంది హాజరు, క్రమశిక్షణను కూడా పరిశీలించారు. అనంతరం రౌడీ షీటర్లు, మరియు సమస్య సృష్టించే వ్యక్తులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. వారికి చట్టపరమైన హెచ్చరికలు జారీ చేస్తూ భవిష్యత్తులో తప్పుదారిలో నడవకూడదని సూచించారు. అదేవిధంగా, సిబ్బందికి ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి, ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతల పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్.ఐ గారికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు.

## అప్పుల కుప్పగా రాష్ట్రం

పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:



గత వైసిపి పాలనలో, నేడు కూటమి పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి సభ్యులు పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని గత వైసిపి పాలనలో మూడు లక్షల 30 వేల కోట్ల రూపాయలు ఉన్న అప్పు నేడు 5 లక్షల కోట్లకు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని నానా యాగి చేసిన కూటమినేతలు నేడు అదే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడం చూస్తుంటే కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందన్న చందంగా కూటమి పార్టీ వ్యవహార శైలి ఉందని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆదాయం అంతా ఒకటే ప్రాంతంలో కేంద్రీకరించి గొప్పలు చెప్పుకుంటున్న కూటమినేతలు నేడు కనీసం వైద్య కళాశాలలు కూడా ఏర్పాటు చేయలేక ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కోరడం దుర్మార్గమని, ఇకనైనా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధిపై దృష్టి సారించి తలసరి ఆదాయాన్ని పెంచే మార్గాలను చూడాలని ఆయన హితవు పలికారు.

## రైతుబజార్‌లో అందుబాటులో ఉల్లిపాయలు

మదనపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :

మదనపల్లె రైతు బజారులో కర్నూల్ ఉల్లిపాయలను రైతులు అందుబాటులో ఏర్పాటు చేసినట్లు మార్కెట్‌యార్డు అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. రైతుబజారులో కిలో రూ.8ల చొప్పున వినియోగదారులకు ఉల్లిపాయలను విక్రయం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వినియోగదారులకు ఉల్లిపాయలను అందుబాటులో ఉంచిందన్నారు. రాయచోటి, పీలేరు మార్కెట్‌యార్డులనందు కూడా వినియోగదారులకు ఉల్లిపాయలను అందుబాటులో ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి వినియోగదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కార్మిక ఉద్యోగ సమస్యలపై అజెంబ్లీలో చర్చించాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :

అసెంబ్లీలో కార్మిక ఉద్యోగ సమస్యలపై ప్రజాప్రతినిధులు చర్చించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. గురువారం ఏఐటియుసి కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం తిరుమల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా ఈనెల 22న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. 12వ పిఆర్‌సి ప్రకటించి వేతనాలను పెంచాలని, ఉద్యోగులకు, కార్మికులకు బకాయిలున్న డిఏ, ఇతర అలవెన్స్‌లను విడుదల చేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని పదే పదే కోరుతున్నా కమీషనర్ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మాదవ్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, నాయకులు దేవా, చలపతి నాయుడు, రాధా, గంగులప్ప, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన

రామసముద్రం,సెప్టెంబర్18 ప్రభాతవార్త

రామసముద్రం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని గురు వారం ఎంపీడీవో గఫూర్ సందర్శించారు.పంచాయతీ కార్యదర్శి మునిస్వామినాయక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని అధికారులకు తెలియజేశారు.ఈకార్యక్రమం లో ఎంపిడిఓ గఫూర్ పంచాయతీ సెక్రటరీ మునిస్వామినాయక్ కార్మికులు పాల్గొన్నారు.

# బి. కోడూరులో మెగా వైద్య శిబిరం

పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వినీత్ కుమార్ రాజు. డాక్టర్ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో గురువారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా స్వస్థనారి స్వశక్తి పరివార అభియాన్ మహిళల ఆరోగ్యం కోసం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి రితీష్ కుమార్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా ఆరోగ్య సేవలు సెప్టెంబర్ 17 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో విలేజ్ హెల్త్ క్లినిక్ ల లో మరియు గ్రామాల నందు నిర్వహించాలని క్యాన్సర్‌కు సంబంధించిన ముందస్తు స్కానింగ్ నిర్వహించాల్సిన అత్యవసరం ఎంతైనా ఉందని వైద్యాధికారులకు తెలియజేశారు. నిపుణులైన డాక్టర్ల ద్వారా స్త్రీ వ్యాధి నిపుణులు. చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు. జనరల్ మెడిసిన్ మరియు కంటి పరీక్షలు మరియు ఆరోగ్య సేవలు అందించి ప్రజల్లో రక్తహీనత పైన. క్షయ వ్యాధి పైన చికిత్స గర్భిణీల ప్రస్తుత పరీక్షలు, చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాలు ఎన్టీఆర్ వైద్య పరీక్షలు మొదలగు కార్యక్రమాల పైన ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి రితీష్ కుమార్ రెడ్డి, కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ, టిడిపి మండల అధ్యక్షులు ఓకిలి రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి ఓబుల్ రెడ్డి రమణారెడ్డి, బిజెపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు రామ సుబ్బారెడ్డి,ఉట్టి శ్రీనివాసులు, నారిశెట్టి నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణాచారి, అసెంబ్లీ కో కన్వీనర్ పల్లంశెట్టి పందరి, వైద్యాధికారులు డాక్టర్ వినీత్ కుమార్ రాజు, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డు ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌లకు సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :

మార్కెట్‌యార్డు ఛైర్మెన్ జంగాల శివరామ్, వైస్‌ఛైర్మెన్ రామిశెట్టి ఆంజినేయులతో పాటు డైరెక్టర్లను జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి ఘనంగా సన్మానించారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాందాస్ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మార్కెట్‌యార్డు పదవుల నియామకంలో సముచిత స్థానం కల్పించిందన్నారు. ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌లు సంయుక్తంగా డైరెక్టర్లతో కలసి మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగాయార్డులో రైతుల సమస్యల పనరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలే పరిష్కార ద్యేయంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మున్నానాయక్, సిటిఎం నరసింహులు, భర్నేపల్లి రవికుమార్, బిజెపి నాయకులు పూలనాగరాజు, జేకెవర్మా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యం సాధించాలి

వేంపల్లె :సెప్టెంబర్ 18:(ప్రభాత వార్త)



సాంకేతిక విద్య పూర్తి చేసిన యువతకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయాని కాబట్టి సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐలో 2023-2025 విద్య సంవత్సరంలో చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సాంకేతిక విద్యా చదివిన విద్యార్థులు పరిశ్రమలు కూడ పెట్టుకోవచ్చు అన్నారు. అనంతరం ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఐటిఐలో విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ఇంజనీరింగ్ మరియు నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించడం వలన ఐటిఐ కోర్సులు గ్రామీణ విద్యార్థులలో బాగా ప్రాచుర్యం పొందినట్లు చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గ్రామీణ ప్రాంతమైన వేంపల్లెలో కందుల ఓబుళరెడ్డి ఐటిఐని స్థాపించినట్లు చెప్పారు. అనంతరం ఆయా ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తులసిరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ అధ్యాపకులు చంద్రశేఖర్, ఉత్తమారెడ్డి, ప్రభాకర్ నాయుడు, వెంకటరెడ్డి, మార్కయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన

రామసముద్రం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ఎ హెచ్‌సి వైద్యులకు జిల్లా వైద్యాధికారి లక్ష్మి నరసయ్య సూచించారు. రామసముద్రం, చంబకూరు పిహెచ్‌సిలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైద్య సేవలకు పలు రికార్డులను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్త్ నారి స్వశక్తి పరివార్ పథకంను విజయవంతం చేయడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరం నిర్వహించి, ప్రతి మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి గ్రస్తులు ఉంటే వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి వైద్యాధికారులు జాహ్నవి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పీలేరు-కలకడ జాతీయ రహదారిపై ప్రమాదం

కె.వి పల్లి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :

కె.వి.పల్లి మండలం మఠంపల్లి పంచాయతీ పరిధిలోని కలికిరి వాండ్లపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా వెళ్తున్న లారీ ఎటువంటి ఇండికేటర్స్ ఇవ్వకుండా ఒక్కసారిగా రైట్ వైపు కదలడంతో, వెనుకనుంచి వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న పడగంటి ఈశ్వర్ (26) తీవ్రంగా గాయపడి తలకు గట్టిగా రక్తగాయమైంది. వెంటనే అంబులెన్స్ ద్వారా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ఫస్ట్ ఎయిడ్ అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.కారు డ్రైవర్ వంజరపు గణేష్ (27), మహేష్ బాబు (28), పోతిరెడ్డి గౌతం (27), గడపొయిన మహేంద్ర (27)లకు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక వైద్యులు చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## పోరాట సభను జయప్రదం చేయాలి

సిద్ధవటం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



విజయవాడలో ఎం.బి.కె విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ 12వ తేదీన జరగనున్న దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభను జయప్రదం చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కడప జిల్లా అధ్యక్షుడు ఎం చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సిద్ధవటంలోని ఎమ్మార్సీ వద్ద గురువారం భవిష్యత్తు పోరాట సభ గోడ పత్రాలను ఎంఆర్సి సిబ్బంది, పార్ట్ టైం ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పోస్టర్ను ఎంఆర్సి గోడకు అతికించి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉపాధ్యాయులను ఇతర విభాగాల సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఏర్పడి దశాబ్ది కాలం పూర్తయిన నేపథ్యంలో అక్టోబర్ 12వ తేదీన దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభను ఏర్పాటు చేస్తున్నారని, సమగ్ర శిక్ష కింద పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులు హాజరుకావాలని ఆయన కోరారు.

## రంగనాథుని కోవెల పనులను పరిశీలించిన అతికారి



సిద్ధవటం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త

రంగనాథుని కోవెల అభివృద్ధివైపు పరుగులు పెడుతుంది గత కొన్నేళ్లగా ధూప నైవేద్యానికి నోచుకోని పురాతనమైన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథుని కోవెల అభివృద్ధివైపు పరుగులు పెట్టడంతో రంగనాథుని భక్తులు ఆనందోత్సవమై పోయారు మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామంలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథుడి కోవెల ఆలయ అభివృద్ధి పనులను గురువారం రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతి కారి కృష్ణ కోవెల పనులను పరిశీలించడంతో రంగనాథుడిని భక్తులు ఆనందోత్సవ మైపోయారు తన సొంత నిధులతో ఆలయ ప్రాంగణంలో బండలపరుపు విద్యుత్, గ్రానైట్, పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి ఉగాది నాటికిరంగనాథుని మూల విరాట్ విగ్రహం, గజ స్థంభం ప్రతిష్ట చేసి పూర్వ వైభవం తీసుకురావడానికి జోరుగా పనులు కొనసాగుతున్నాయి ఈ సందర్భంగా జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ మాట్లాడుతూ పురాతనమైన రంగనాథుని కోవెల ఎండోమెంట్ పరిధిలో ఉందని ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నారని ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చి వై బోవహితంగా పూజా కార్యక్రమంలో నిర్వహించే విధంగా కృషి చేస్తా అన్నారు ఆలయ ముఖద్వారం సమీపాన వాహనాల పార్కింగ్ కొరకు స్థల సేకరణ చూస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో అతి కారి చిన్న వెంకటయ్య సిద్ధవటం సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య మాజీ విద్యా కమిటీ చైర్మన్ మునిస్వామి మైనార్టీ నాయకుడు గౌస్ బాషా మహబూబ్ బాషా పసుపులేటి గంగయ్య విజయ్ మేస్త్రి శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

పులివెందుల సెప్టెంబరు 18,ప్రభాత వార్త:

కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీ కరణ చేయడం ఉపసంహరించుకోవాలని , ప్రైవేటీకరణను నిరసిస్తూ నేడు వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం 2019-24 మధ్యలో కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రానికి 17 కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు చేయడం జరిగిందని వాటిలో 5 కాలేజీల్లో ఇప్పటికే విద్యాబోధన ప్రారంభమైందినీ అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మరో రెండు మెడికల్ కాలేజీల్లో 50 సీట్లతో బోధనకు మెడికల్ నేషనల్ కమిషన్ నుంచి అనుమతి కూడా లభించిందనీ కానీ ఈ విషయాలను విస్మరించి, కూటమి ప్రభుత్వం అసత్య ఆరోపణలు, అప ధ్ధపు ప్రచారాలు చేస్తూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తోందన్నారు. నేడు పులివెందులలోనీ మెడికల్ కళాశాల వద్ద ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.

## మహిళల ఆరోగ్యం దేశ సౌభాగ్యం : డాక్టర్ సాయిశ్రీ

వాల్మీకిపురం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని చింతపర్తి పీ. హెచ్. సి. ద్వితీయ వైద్యులు సాయిశ్రీ అన్నారు. గురువారం స్ విటలం గ్రామంలో ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమును స్థానిక సర్పంచ్ శ్వేత అధ్యక్షతన లాంచనంగా ప్రారంభించారు. మహిళా ఆరోగ్యం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంములు పెద్ద పీట వేస్తున్నాయి. ఈ పౌష్టికాహారం గర్భిణీలకు పంపిణీ చేయడం, క్యాన్సర్ స్క్రీనింగ్, జీవన శైలిలో మార్పులు పై అవగాహనా సదస్సు, వ్యాధి నిరోధక టీకాలు, ప్రధాన మంత్రి ఆరోగ్య భీమా కార్డుల నమోదు, సికెల్ సెల్ పరీక్షలు, మందుల పంపిణీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ద్వితీయ వైద్యులు డాక్టర్ సాయిశ్రీ, సి. హెచ్. ఓ. అరుణ, డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు బహుద్దీన్,అంగన్వాడీ పర్యవేక్షకులు, ఎమ్. ఎల్. హెచ్. పీ లు, ఏ. ఎన్. ఎమ్ లు,అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

బద్వేల్ అర్బన్, సెప్టెంబర్ 18, ప్రభాత వార్త



రాష్ట్రంలో ఎలా తరబడి విధులు నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన విద్యుత్ భవన్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు విద్యుత్ కార్మికులు తెలిపారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయబ్ రసూల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలనీ ,అలాగే గత 20 ,25 సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ 2022 పిఆర్సి అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని అలాగే కొత్త ఆపరేటర్లందరి కి పాత ఆపరేటర్ల తో సమానంగా జీతాలు ఇవ్వాలని తెలిపారు. డిస్కం కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ స్కిల్డ్ వేతనం ఇవ్వాలని ప్రతి సబ్ స్టేషన్ లో నైట్ వాచ్ మెన్ ల సౌకర్యం కల్పించాలని ,అలాగే కార్మికులకు అనారోగ్యం పాలైన యాక్సిడెంట్ గురైన ఉచితంగా అన్లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కానందున సెప్టెంబర్ 20 తేదీన శనివారం విద్యుత్ భవన్ ఎస్ ఈ కార్యాలయం నందు విద్యుత్ కార్మికుల కుటుంబాలతో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమము ఉంటుందన్నారు . ఈ ధర్నా కార్యక్రమంలో కాంట్రాక్ట్ మరియు రెగ్యులర్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలియజేశారు.

# జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి


కలెక్టర్ కు పుష్పగుచ్చం తో స్వాగతం పలుకుతున్న ఆర్డీవో శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్


సమావేశానికి హాజరైన అధికారులు

**పీలేరు సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**

జిల్లాలో అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం పీలేరు అసెంబ్లీని యోజకవర్గంలోని అన్ని మండల స్థాయి మరియు నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ను పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయం లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్, పశుసంవర్ధక,సివిల్ సప్లై, మైనర్ ఇరిగేషన్, రీ సర్వే, ఎడ్యుకేషన్, శ్రీ శక్తి పథకం, అన్నదాత సుఖీభవ, పి 4,హౌసింగ్, పంచాయతీరాజ్, స్వమిత్వ, ఐవిఆర్ఎస్, ఏపీ ఎస్పీడీసీఎల్ తదితర అంశాలపై నియోజకవర్గ,మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్ని ఎంపిడిఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓలు ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి వనరుల తనిఖీ చేయాలి. ఎస్ఓపి ప్రకారం క్లోరినేషన్, శుభ్రపరిచే చర్యలు తప్పనిసరిగా చేయాలి. ప్రతి సారి ఫోటోలు, టైమ్ స్టాంప్‌తో రికార్డులు ఉండాలని ఆదేశించారు. ఫైప్‌లైన్ ఎక్కడా డ్రైనేజీ లైన్‌తో కలిసిపోకూడదని, అలాంటి చోటు ఎక్కడైనా కనిపిస్తే, సంబంధిత పంచాయతీ కార్యదర్శి, అధికారులు జాయింట్‌గా బాధ్యత వహించాలన్నారు. ట్యాంకుల కవరేజ్ తప్పనిసరి. ట్యాంకులపై సరైన కవర్లు ఉండాలని లేకుంటే పక్షులు, ఎలుకలు, చెత్త వంటి పదార్థాలు నీటిలో పడే ప్రమాదం ఉందన్నారు. ట్యాంకుల శుభ్రపరిచే పనులు రెగ్యులర్‌గా చేయాలి. ఈ వారం చివరికల్లా అన్ని ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీలు, అధికారులు కలసి నివేదిక ఇవ్వాలని, ఫైప్‌లైన్‌లు ఎక్కడా డ్రైనేజీ పక్కన లేకుండా ట్యాంకులుకు మూత ఉన్నాయని, క్లోరినేషన్ సక్రమంగా జరుగుతోంది అని నిర్ధారించుకొని నివేదికలను అందజేయాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య పెద్దగా లేదని చెప్పారు. అయితే, పంపిణీ, నిర్వహణ, పరిశుభ్రత అంశాల్లో కఠిన చర్యలు అవసరమని అన్నారు. అలాగే సింగిల్ విలేజ్ స్కీమ్స్, బోరువెల్స్ వద్ద రీచార్జ్ స్ట్రక్చర్స్‌ను ఈ రోజే తనిఖీ చేసి ఎక్కడైనా లేకుంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదానికి పంపాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండల అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కలకడ మండలంలోని వాటర్ సప్లై పాయింట్లను పరిశీలించి నీటి కొరత సమస్యలు ఎదుర్కొనే గ్రామాలకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రైతు బావుల సమీపంలో అదనపు రీచార్జ్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేసి, ఈ ప్రణాళికలపై రైతులతో చర్చించి వారి సూచనల ఆధారంగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి పనులు మాత్రమే కాకుండా కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని వచ్చే ఆరు నెలల్లో, వచ్చే ఒక సంవత్సరంలో మీరు చేయాలనుకున్న కొత్త ప్రతిపాదనలు, ప్రణాళికలను పూర్తిగా సిద్ధం చేసుకోవాలని, తదుపరి సమావేశంలో వాటిపై సమీక్ష ఉంటుందన్నారు. అంతేకాక, నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులు, వివిధ ప్రాజెక్టులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిపై చర్యల నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి సారీ పీలేరు నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు ఆర్డిఓ, డిఆర్డిఏ పిడి పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలవతో సత్కరించారు.ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి నాగేశ్వర రావు, డిపిఓ రాధమ్మ,జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, వాల్మీకిపురం, కలికిరి,కలకడ, గుర్రంకొండ, కె.వి పల్లి తహసిల్దార్లు, ఎంపీడీవోలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులు, ఎంఈఓ లు, మండల సర్వేలు, ఇతర మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ లీగల్ సెల్, మీడియా చైర్మన్‌గా సి.వి.సురేష్

**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



2024-2026 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ లీగల్ సెల్ మరియు మీడియా చైర్మన్‌గా ప్రొద్దుటూరుకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రముఖ న్యాయవాది సి.వి.సురేష్‌ను నియామకం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్నరామ సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు టి.జి. వెంకటేష్ నుండి ఉత్తర్వులు అందినట్లు సి.వి. సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తనను లీగల్ సెల్ కం మీడియా కమిటీ చైర్మన్‌గా నియమించినందులకు రాష్ట్ర ఆర్య వైశ్య మహా సభ గౌరవాధ్యక్షులు టి.జి.వెంకటేష్ కి, అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణకి, ఇల్లూరు లక్ష్మయ్యకి, సిటీ కేబుల్ మహేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన వివరించారు.

## సమపాళ్లలో పోషకాహారం సేవించాలి



**పెనగలూరు సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఉన్నటువంటి సత్తుపల్లి హరిజనవాడలో ఫైలట్ ప్రాజెక్టు కింద అంగన్వాడీ కేంద్రంలో పద్మావతి అధ్యక్షతన ప్రపంచ పోషక ఆహార దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఆహారం ఆరగించేటప్పుడు సమపాళ్లలో సేవించాలని చిత్తూరు ప్రాజెక్టు సిడిపిఓ నిర్మల జ్యోతి సూచించారు. గురువారం సత్తుపల్లి హరిజనవాడ అంగన్వాడి కేంద్రంలో కార్యకర్త పద్మావతి అధ్యక్షతన పోషకాహార దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన గర్భిణీలు, బాలింతలు తల్లులు ఇతరులకు ఆమె పలు సూచనలు సలహాలు చేశారు. తాము సేవించే ఆహారం రుచిగా ఉందని మోతాదుకు మించి తినకూడదన్నారు. ఇళ్లలో తయారు చేసే ఆహారంలో నూనె చక్కెర ఉప్పు మితంగా వాడాలన్నారు. నోటికి రుచిగా కమ్మగా ఉండాలని ఉప్పుకారం నూనె చక్కెర తదితర మసాలా దినుసులు అధికంగా వాడితే పెరిగే పిల్లలకు ఊబకాయం వస్తుందన్నారు. ఊబకాయం వల్ల పెరిగే మనిషి రకరకాల జబ్బులు బారిన పడతారన్నారు. దాని ఫలితంగా ఆర్థిక నష్టం శరీరకష్టం కుటుంబ సభ్యుల కు మానసిక కష్టం తదితర అనర్థాలు ఏర్పడతాయన్నారు. ప్రస్తుత కాల పరిస్థితులను బట్టి తల్లులు తమ బిడ్డలకు సెల్ ఫోన్లు దూరంగా ఉంచాలని ఆరు బయట పిల్లలతో కలిసి ఆడుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో సూపర్వైజర్ విజయ కుమారి అంగన్వాడీ కార్యకర్తలు ఉమామహేశ్వరి పద్మావతి వసంత భాగ్యమ్మ అరుణ ఏఎన్ఎం సుమలత ఆశా కార్యకర్త ఎర్రి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉజ్వల భవిష్యత్తు బాధ్యత మనందరిది

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :**

జిల్లాలో గంజాయి విక్రయాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు ముమ్మరంగా చేయడంతో గంజాయి వ్యసనానికి అలవాటు పడ్డ యువత ఇతర ప్రత్యామ్నాయ మార్గాలలో భాగంగా మత్తు కలిగే మందుల కోసం మెడికల్ షాప్ లకు వచ్చే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించవద్దని ప్రొద్దుటూరు డిఎస్పి భావన మెడికల్ షాప్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ప్రొద్దుటూరు పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు డి.ఎస్.పి భావన మాట్లాడుతూ సమాజంలో మార్పు వచ్చిందని, మనం సమష్టిగా చర్యలు తీసుకొని డ్రగ్ రహిత సమాజంగా చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఈగల్ ఇంచార్జ్, ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మెడికల్ షాప్ లకు వచ్చి మత్తు కలిగించే మందుల కోసం ఎవరైనా వస్తే అలాంటి వారి సమాచారాన్ని పోలీసు శాఖకు తెలియచేయాలని సూచించారు. వారిని తిరిగి మామూలు వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ తన వంతు కృషి చేస్తుందని రియాజ్ అహ్మద్ వివరించారు. జిల్లా డ్రగ్ ఏడి నాగకిరణ్ కుమార్ వైద్యులు వ్యాధి నయం చేసేందుకు ఉద్దేశించి వ్రాసిన ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికి మాత్రమే మందులు విక్రయించాలని మెడికల్ షాప్ యజమానులకు సూచించారు. ప్రస్తుత సమాజంలో కొన్ని రకాల మందులను యువత దుర్వినియోగం చేసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్.ఎక్స్,



ఎన్.ఆర్.ఎక్స్ ల పేరిట వర్గీకరించి వైద్యులు సిఫారసు చేసే మందులను విక్రయించినపుడు ఎన్ని విక్రయించింది తేదీ, స్టాంప్ తో సహా రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. ప్రిస్క్రిప్షన్ తీసుకువచ్చినా టీనేజ్ వారికి ఎట్టి పరిస్థితిలో ఇవ్వకూడదన్నారు. యువత బాగున్నపుడే దేశ భవిత బాగుంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, యువత మేలుకోరి మనమందరం సమష్టిగా కృషి చేసినపుడే సాధ్యమవుతుందన్నారు. జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ మూర్తి, కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శ్రీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ తమను భాగస్వామ్యులను చేస్తూ ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. యువత మెడికల్ షాప్ లకు వచ్చి మందులను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని అసోసియేషన్ వారిని అప్రమత్తం చేయడం సంతోషంగా ఉందన్నారు. నిబంధనల మేరకు నడుచుకునేలా రిటైల్ షాప్ నిర్వాహకులకు తెలియచేస్తామని, పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమం అనంతరం చికిత్స కు ఉద్దేశించిన మందుల దుర్వినియోగం కాకుండా మా వంతు కృషి చేస్తామని కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు వన్ టౌన్ సిఐ తిమ్మారెడ్డి, టూ టౌన్ సిఐ సదాశివయ్య, త్రీ టౌన్ సిఐ వేణుగోపాల్, ఈగల్ సిబ్బంది, మెడికల్ షాప్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన మానిటరింగ్ కమిటీ సభ్యులు


గవర్నర్ ను సత్కరిస్తున్న ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

**పీలేరు సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పీలేరులో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, వి. రాజ్ కుమార్, మునీంద్ర నాయక్ మాట్లాడుతూ ఆదివారం తిరుమలకు వచ్చిన గవర్నర్ ను తాము కలిసి శాలువతో సత్కరించామన్నారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానంలోని ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, టీటీడీలోని అన్ని వ్యాపార సముదాయాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం గదులు కేటాయించాలని, టీటీడీలోని వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ పొందాక ఖాళీలు ఏర్పడిన స్థానాలను వెంటనే భర్తీ చేసి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు ఎక్కువ శాతం ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపట్టాలని వారు గవర్నర్ ని కోరారు. అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించి త్వరలో వీటిపై ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతమ్మ, సత్యాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిన్ పీజీలో రాష్ట్ర స్థాయిలో 202 ర్యాంకు

**గాలివీడు, సెప్టెంబర్ 18(ప్రభాతవార్త):**



గాలివీడు మండలం నూలివీడు పంచాయతీకి చెందిన నక్కల కొండారెడ్డి అనే యువకునికి మెడిసిన్ పీజీలో రాష్ట్ర స్థాయిలో 202వ ర్యాంకు సాధించాడు. ఇతను స్థానిక నూలివీడులోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో పదవ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. అనంతరం ఇంటర్మీడియట్‌లో బైపీసీ తీసుకొని ఎస్వి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఎంబీబీఎస్ పూర్తయిన అనంతరం పీజీకి ఎంట్రన్స్ రాయగా ఇటీవల ప్రభుత్వం ఫలితాలను ప్రకటించింది. ఫలితాలలో ఆ యువకునికి 202 ర్యాంకు సాధించారు. ఒక మారుమూల రైతు కుటుంబంలో జన్మించిన కొండారెడ్డి పీజీ మెడిసిన్‌లో మంచి ర్యాంకు సాధించడం పట్ల గ్రామ ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు రఘునాథరెడ్డి, చంద్రకళ వీరు నిత్యం వ్యవసాయం చేసుకుంటూ కుమారుని ఉన్నత చదువులు చదివించారు. తాను పీజీలో పీడ్రియాటిక్ (చిన్నపిల్లల వైద్యం) కోర్సును తీసుకోనున్నట్లు అతను తెలిపారు. తనకు తెలంగాణాలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ మరియు తమిళనాడులోని మద్రాస్ మెడికల్ కాలేజీ రెండింటిలో సీటు వస్తుందని పేర్కొన్నారు. పేద ప్రజలకు వైద్యాన్ని అందించడమే తమ లక్ష్యం అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ఉపాధి హామీ పనులు వెనుకబాటు తగదు.



**తంబళ్లపల్లె సెప్టెంబర్ 18 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలంలో ఉపాధి హామీ పనులు మంద కొడిగా జరగడంపై ఏపీడి నందకుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీవో థామస్ రాజా తో కలసి ఉపాధి హామీ అధికారులతో జరిపిన సమీక్షలో మండలంలోని ఇరవై ఒక్క పంచాయతీలలో పలు పంచాయతీలలో ఉపాధి పనులు పూర్తిగా తగ్గిపోవడంపై ఆరా తీశారు. ఉపాధి పనులకు కూలీలు రాకపోవడానికి కారణాలు ఇందుకు ఉపాధి హామీ సిబ్బంది తీసుకున్న చర్యలపై అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీల వారీగా ఉపాధి పనులపై రికార్డులు పరిశీలించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఉపాధి పనులు వేగవంతం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్నికల్ అధికారులు చొరవ చూపి ఫీల్డ్ అసిస్టెంట్లను క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలికి పని కల్పించాలని సూచించారు. ఉపాధి అధికారులు ఉపాధిలో పండ్ల తోటలు పెంపకం, గడ్డి పెంపకం, ఇంకుడు గుంతల తవ్వకాలు చేసిన పనులు ఏపిడికి వివరించారు. ఈ సమీక్షలో ఈసీ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సుజాత, పుష్ప కుమారి, బాలగంగాధర్, బావాజీ,భూదేవి లు పాల్గొన్నారు.

## ప్రారంభమైన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్



**ఖాజీపేట, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**

ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఖాజీపేట విలేజ్ హెల్త్ కేంద్రం నందు గురువారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి ముబీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్త్రీలకు అన్నీ రకాల వైద్య సేవలు అందించాలని, స్త్రీలకు ఏ విధమైన ఆరోగ్య పరీక్షలు అవసరం అయినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని మరియు ప్రధాన మంత్రి జన్మదిన సందర్భంగా ప్రారంభించిన ఈ పథకాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకొని, ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని విలేజ్ హెల్త్ సెంటర్ లలో జరుగుతాయని వైద్యాధికారి తెలిపారు. రాష్ట్ర పర్యవేక్షకులు కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తూ గర్భవతులు, బాలింతలు పర్యవేక్షణ, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత, అసంక్రమిత వ్యాధుల పరీక్షలు భాగంగా రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు 30 సంవత్సరాలు పైబడిన వారికి నిర్వహించడం ప్రాముఖ్యత గురించి మరియు ఆయుష్మాన్ భారత్ లో భాగంగా పి ఎం జె ఏవైకార్డ్ ఆన్లైన్, కౌమార బాలికలకు రక్తహీనత పరీక్షలు, రుతుక్రమ పరిశుభ్రత గురించి తెలియచేశారు. పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం గురించి తల్లులకు తెలియజేయుట సికిల్ సెల్ అనీమియా పరీక్షలు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యవేక్షకులు డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సుప్రీతా రాజ్, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, వైద్యాధికారి ముబీన్, ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, అరుణకుమారి, సూపర్ వైజర్స్ శోభన్‌బాబు, కృష్ణ ప్రియ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, హెల్త్ అసిస్టెంట్( స్త్రీ) సచివాలయ ఏఎన్ఎంలు, ఆశాలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు దువ్వూరు విద్యార్థులు



**దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**

ఇటీవల ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జి క్లబ్ ఆవరణలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాతో జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 14, అండర్ 17 తైక్వాండో పోటీలలో శ్రీ షిరిడి సాయి హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తైక్వాండో మాస్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో సంజీవల హారిని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని అన్నారు. అలాగే సిరి చందన రెండవ స్థానంలో నిలిచారన్నారు. అండర్ 17 బాలుర విభాగంలో చైతన్య మొదటి స్థానంలో, రామ హేమంత్ రాయలు రెండవ స్థానంలో నిలిచారన్నారు. ఈ విద్యార్థులను హైస్కూల్ కరస్పాండెంట్ లోకేష్, ప్రధానోపాధ్యాయులు మస్తాన్, నరేష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

## డిప్యూటీ తహసీల్దారు చొరవతో దారి సమస్య పరిష్కారం

**కలికిరి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

కలికిరి మండలం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) వెంకటరమణారెడ్డి చొరవతో అన్నదమ్ముల మధ్య ఉన్న దారి వివాదం పరిష్కారమైంది. మర్రికుంటపల్లె పంచాయతీ పెద్దఎల్లంపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి ఆయన సోదరుడు ఆనందరెడ్డికి దారి సమస్య, భూములకు సంబంధించి సబ్ డివిజన్ చేసుకునేందుకు సమస్య ఉంది. ఈ సమస్య గత సంవత్సరం నుంచి ఉంది. పలుమార్లు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అన్నదమ్ముల సమన్వయ లోపంతో దారి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల కలికిరి మండలం రీసర్వేగా బాధ్యతలు చేపట్టిన వెంకట రమణారెడ్డి గురువారం మర్రికుంటపల్లె పంచాయతీకి రావడం జరిగింది. ఇద్దరు అన్నదమ్ములతో సమావేశమై సమస్య పరిష్కరించేందుకు అధికారులకు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ సూచించారు. దీంతో ఇద్దరు అన్నదమ్ముల మధ్య సమన్వయం ఏర్పరచడంతో సమస్య పరిష్కారం అయ్యింది. దీంతో పాటు తమ భూములు సబ్ డివిజన్ చేసేందుకు ఇద్దరి అన్నదమ్ముల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో సమస్య పరిష్కరించేందుకు అధికారులకు సులభతరమైంది. ఎన్నో రోజులుగా ఉన్న సమస్యను డీటీ పరిష్కరించడంతో ఇద్దరు రైతులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సురేష్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ చైతన్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల అవినీతిపై కమిటీ వేయాలి

### అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :**


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వైకాపా ప్రభుత్వ పాలనలో జరిగిన మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లోని అవినీతిపై ప్రత్యేక విచారణ కమిటీ వేయాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసెంబ్లీలో స్పీకర్ దృష్టికి తెచ్చారు. గురువారం అసెంబ్లీలో మదనపల్లె ఎమ్మెల్యే మాట్లాడుతూ మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకొందని, గుత్తేదారులు, వైకాపా పాలనలో ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టారన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో ఇసుక, ఇటుకలు, సిమెంటు నాణ్యత లేనిది వాడడం పట్ల కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. కోట్లాది రుపాయలు అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైకాపా ప్రభుత్వం గతంలో అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడిందన్నారు. కళాశాల నిర్మాణ పనులను నాణ్యతగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పిపిపి విధానంతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గతంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు.

## మొక్కజొన్న పంట పరిశీలన

**ముద్దనూరు.సెప్టెంబర్18 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను జిల్లాస్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం నాడు పరిశీలించారు. డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ యన్.క్రిష్ణ ప్రియ మరియు జెనెటిక్స్ ,ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీవల్లి అలాగే ప్లాంట్ పెథాలజీ శాస్త్ర వేత్త వి.మాధురి బృందం ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటను పరిశీలన చేసి రైతులు సాగు చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాహో కంపెనీకి చెందిన విత్తనాలను తాడిపత్రి పట్టణంలోని దుకాణం నుంచి కొనుగోలు చేసి కంపెనీ సిబ్బంది సూచనల ప్రకారం పంట సాగు చేపట్టామని , పంట ఎదుగుదల లోపించి కంకి ఏర్పడక నాసిరకం కంకులు ఏర్పడి పూర్తిగా నష్టపోయామని, నాసిరకం విత్తనాలు విక్రయించిన కంపెనీపై తగిన చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేకూర్చాలని కోరారు. దీనిని ఉన్నత అధికారులకు తీసుకెళ్లి రైతులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిల్ సైన్స్ విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ సి.యాస్మిన్,ఏడిఏ కె.రామ మోహన్ రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డి, గ్రామ విహెచ్ఏ రామసుధ, శిరీష, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## పోషకాహారంపై అవగాహన సదస్సు



**పెండ్లిమర్రి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వస్తనారి సశస్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని ఇసుకపల్లి గ్రామ సచివాలయంలో పోషణ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య మరియు అంగన్‌వాడీ వారి ఆధ్వర్యంలో పోషకాహారం గురించి గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించడం జరిగింది. వైద్యాధికారి డా.లిఖిత మాట్లాడుతూ ప్రతి గర్భిణీలు టీకాలు, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం సీడీపీవో శాంతమ్మ మాట్లాడుతూ గర్భిణీలు పోషకాలు కలిగిన అన్ని ఆహార పదార్థాలను తీసుకోవాలని అంగన్‌వాడీ నందు ఇచ్చే పోషకాహార కిట్‌ను తీసుకొని తిని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈవో శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్పన, సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

## వాహనదారులకు కౌన్సెలింగ్

**కడప క్రైం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సై యు.వై.జయరాములు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాల సైలెన్సర్లు మార్చి నడుపుతున్న వారికి జరిమానాలు విధించి బైక్‌ల సైలెన్సర్లు తీసివేయించారు. మరో సారి శబ్ధ కాలుష్యం చేస్తే ఇతర సైలెన్సర్లు వాడితే బైక్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో వారి పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానాలు విధించారు.

## క్రీడాకారులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

**వేంపల్లె:సెప్టెంబర్ 18 (ఆంధ్రప్రభ):**

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలంటే ప్రతి విద్యార్థి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటిలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషకరమని చెప్పారు. చదువుల్లో, ఆటలలో ప్రతి విద్యార్థిని ముందు ఉండాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ లు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని తెలిపారు. పట్టుదల, లక్ష్యం, అంకితభావం ఉండాలని సూచించారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటిలకు ఎంపికైన బిందు మాధవి, మన్సూర్, నూరుల్లా, ఉమర్, ఆర్తికాలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, జబిబుల్లా, పీరా సాహెబ్, వేమా కుమార్, సేవా దల్ అధ్యక్షుడు రఫీ, ఉర్దూ పాఠశాల హెచ్ఎం ప్రసాద్, పిఇటి షాహీన్ ఉపాధ్యాయులు ఖాయుమ్ అక్బర్ బాషా, రియాజుర్ రహేమాన్, వెంకట రమణ. శారదా, శ్రీ లక్ష్మి, సారో,లతో పాటు , విద్యార్థులు పాల్గొన్నారు.

